# సింగిల్ పేజీ కథలు

## గోల్

'ఈ రోజు ఎలాగైనా నా మనసులో మాట సాహితికి చెప్పాలి' అప్పటికి వందోసారి అనుకున్నాడు శేఖర్.

'ఈపాటికి సాహితి గుడికి వచ్చేసి వుంటుంది' బైక్ స్పీడు మరికాస్త పెంచాడు.

సాహితి తనతోపాటే చదువుతుంది. ఆమె ముఖంలో తేజస్సు, చదువులో మేధస్సు, అందరితో కలిసిపోయే మనస్సు చూసి ఆకర్షితుడయ్యాడు. క్రమేపీ ఆ ఆకర్షణ కాస్తా ప్రేమగా మారింది. కానీ తన ప్రేమ విషయం సాహితితో చెప్పలేకపోతున్నాడు. అలాగని చెప్పకుండా స్థిమితంగా వుండలేకపోతున్నాడు.

ఆమెకున్న అనేక మంచి అలవాట్లలో ప్రతి గురువారం బాబా గుడికి వెళ్లడం ఒకటి. అందుకే తన ప్రేమ విషయం బాబా సన్నిధిలోనే చెప్పి ఒప్పించాలని గుడికి చేరుకున్నాడు.

అప్పటికే దర్శనం పూర్తి చేసుకొని గుడి ఆవరణలో కూర్చుని వుంది.

"హాయ్.. సాహితి" అంటూ పలకరించి ఆమెకు కాస్త ఎడంగా కూర్చున్నాడు.

"హలో..." అంటూ తనూ పలకరింపుగా నవ్వింది.

"ఏంటి శేఖర్.. నువ్వూ గుడికి రావడం అలవాటు చేసుకుంటున్నావా? వెరీగుడ్.. మంచి అలవాటు" అంది మెచ్చుకోలుగా.

"గుడికి వచ్చింది ఆ దేవుడి కోసం కాదు, నా దేవత కోసం" అంటూ అనబోయాడు. కానీ నాలుక చివరి వరకు వచ్చిన ఆ మాట పెదవి దాటి బయటకు రాలేదు ధైర్యం చాలక.


ఇంక ఇలా ఉపేక్షించి లాభం లేదనుకున్నాడు. మనసులో కాస్త ధైర్యం తెచ్చుకొని "సాహితి! నిన్నొక విషయం అడగాలనుకుంటున్నా, కాదు నీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నా" తడబడుతూ అన్నాడు.

ఆ తడబాటు చూసి చిన్నగా నవ్విన సాహితి "అప్పు అడగాలనుకుంటున్నావా, లేక చెప్పాలనుకుంటున్నావా? కరెక్టుగా చెప్పు" అంది.

"నువ్వంటే నాకిష్టం. నిన్ను ప్రేమిస్తున్నాను. అదే చెప్పాలనుకున్నది. నీకూ ఇష్టమైతే పెళ్లి కూడా చేసుకోవాలనుకుంటున్నాను. నేనడగాలనుకుంది ఇదే. నేను ఫ్రాంక్‌గా చెప్పాను. నన్ను నిరాశపరచవని ఆశిస్తున్నాను" పాఠం అప్పజెప్పున్నట్టు చెప్పాడు సాహితి మొహంలోకి చూస్తూ.

ఆ మాట విన్న సాహితి పులకించిపోలేదు. అలాగని కోపంతో కళ్లెర్రజేసి ఆవేశంతో ఊగిపోలేదు. ఆమె ముఖంలో ఏ విధమైన డిఫరెంట్ ఫీలింగ్ లేదు. అంతకు ముందెలా వుందో ఆ మాట విన్న తర్వాత కూడా అదేవిధంగా నిర్మలంగా వుంది.

"మా అమ్మానాన్నలకు నేనొక్కడినే. బోలెడంత ఆస్తుంది. ఏ చెడు అలవాట్లు లేవు. నేనెలాంటివాడినో నీకూ తెలుసు. ఇంక నాలో లోపమేదైనా వుందా?" సూటిగా అడిగాడు ఈసారి.



"ప్రేమ, ఇష్టం లాంటివన్నీ కాసేపు ప్రక్కన పెట్టి ముందు నేను చెప్పింది ఒక్కసారి శ్రద్ధగా విను శేఖర్" మెల్లగా చెప్పింది అతని వైపు చూస్తూ. ఏం చెప్పబోతుందన్నట్టు ఆసక్తిగా చూస్తున్నాడు శేఖర్.

"నిజం చెప్పాలంటే మన యువత ఆలోచనలో, అదీ కొంతమందిలో ఈ లోపం కనబడుతుంది. జీవితానికి పునాది లాంటి ఈ వయసులో ప్రేమా, గీమా అంటూ వెర్రి మొర్రి వేషాలు వేస్తూ చదువు మీద దృష్టి పెట్టం. దాని ఫలితం ఎగ్జామ్స్‌ల మంచి మార్కులు పొందలేకపోవచ్చు, లేదా ఫెయిల్ కావచ్చు. ఈ విషయం పెద్దవాళ్లకి తెలిస్తే మనం చెడు దారిన తిరుగుతున్నామని వాళ్లు ఆందోళన పడతారు. ఆ వయసులో వాళ్లని క్షోభ పెట్టడం న్యాయమా చెప్పు?"

"పోనీ వాళ్లేమైతే మనకెందుకు అని మన ఇష్టప్రకారం మ్యారేజ్ చేసుకున్నామనుకుందాం. అప్పుడు మనకు జీవితంలో ఏ ఉపాధి లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసివస్తుంది. సంఘం దృష్టిలో చేతకానివాళ్లలా చిత్రీకరించబడతాం. అది భరించలేక మనం ఏ అఘాయిత్యానికైనా పాల్పడడానికి కూడా ఆస్కారం వుంది. చూశావా! ఒక్కసారి వెనక్కి ఆలోచిస్తే ఎంత రిస్క్ వుందో!"

"మనమీద ఎన్నో ఆశలతో, మనల్ని ప్రయోజకుల్ని చేయాలనే ఒక ఆశయంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, మనక్కావల్సిన వసతులు సమకూర్చుతారు. అటువంటివారి నమ్మకాన్ని తుంగలో తొక్కి, మనం పెడదారిన నడవడం ఎవరికీ శ్రేయస్కరం కాదు."

"ప్రేమించడం తప్పు కాదుగా అని నువ్వనుకోవచ్చు. యస్.. ప్రేమించడం తప్పు కాదు. కానీ ముందు మన మీద మన తల్లిదండ్రులు చూపించే ప్రేమను ప్రేమించాలి. భవిష్యత్తులో మన ఎదుగుదలకు ఉపయోగపడే స్టడీస్‌ని ప్రేమించాలి. వీటన్నిటిముందు మనం ప్రేమ అనుకుంటున్న ఈ ఆకర్షణ చాలా చిన్నది. అదెంత కాలం నిలుస్తుందో గ్యారెంటీ లేదు."

"కాలేజీలో జాయినైనప్పుడు మనకొక 'గోల్' వుంటుంది. బాగా చదవాలని, జీవితంలో మంచి పొజిషన్‌కు చేరుకోవాలని. కానీ మనం చేరుకోవాల్సిన గమ్యానికి ఇవన్నీ అడ్డుగోడలు లాంటివి. అందుకు ఫస్ట్ మనం లవ్ చేయవలసింది మన గోల్‌ని."

"ఎంత కష్టపడి చదివేస్తే మాత్రం మనమంతా కిరణ్ బేడీ, సి.వి.రామన్, అబ్రహాం లింకన్‌లంత అయిపోతామా అని నువ్వు అడగవచ్చు. అంతటివాళ్లం కాకపోవచ్చు కానీ జీవితంలో ఖచ్చితంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు. రేపొద్దున్న మనల్నీ మరికొంతమంది ఆదర్శంగా తీసుకోవచ్చు కదా!"

"అందుకే ఫస్ట్ లైఫ్‌లో మంచి పొజిషన్‌లో సెటిలవ్వాలి అనే లక్ష్యాన్ని ఛేదిద్దాం. ఆ తరువాత అప్పటికీ నువ్వుంటున్న ప్రేమ అలాగే నిలబడితే మన పెద్దవాళ్లని ఒప్పించి పెళ్లి చేసుకుందాం. వాళ్ల ఆశయాన్ని మనం నెరవేర్చినప్పుడు మన ఇష్టాన్ని వాళ్లూ కాదనలేరు. ఎందుకంటే మనకీ ఆచి తూచి నిర్ణయం తీసుకోగల సమర్థత వచ్చిందని అప్పుడు మనపై వాళ్లకి సంపూర్ణమైన నమ్మకం కలుగుతుంది. ఇప్పుడు చెప్పు శేఖర్.. నేను చెప్పినదాంట్లో తప్పేమైనా వుందా?" ఆపకుండా చెప్పి ఆపై అతని జవాబు కోసం చూసింది.

కళ్లార్పకుండా వింటున్న శేఖర్ బోధి వృక్షం కింద బుద్ధుడికి జ్ఞానోదయమైందన్నట్టు అతని మనసులో వ్యామోహం అనే చీకటి తొలగింది. తను అనుకున్నదానిలో తొందరపాటు వుంది. సాహితి చెప్పినదాంట్లో వాస్తవం దాగుందని తెలుసుకున్నాడు.

"హేట్సాఫ్ సాహితి... హేట్సాఫ్" మెచ్చుకోకుండా వుండలేకపోయాడు.

సాహితి పుష్పం వికసించినట్టుగా చిన్నగా నవ్వి "పద... కాలేజీకి టైమౌతోంది" అంది.

శేఖర్ కూడా సాహితిని అనుసరించాడు.

**-గుజ్జు సురేష్‌రెడ్డి** (చోడవరం)